## సంస్మరించుకుందాం

# భారత విప్లవోద్యమ నాయకులు కామ్రేడ్ సత్యనారాయణ సింగ్‌కు జోహార్లు

**కామ్రేడ్** సత్యనారాయణ సింగ్ 1923 జనవరి 30న బీహార్ రాష్ట్రం – ఆరా జిల్లాలోని థామర్ గ్రామంలో జన్మించారు. సిపిఐ(ఎం–ఎల్) కేంద్రకమిటీతో ఐక్యతా చర్చలు జరిపేందుకు విశాఖపట్నం వచ్చిన సందర్భంలో మూత్రపిండాల సమస్యతో 1984 అక్టోబర్ 21న హఠాత్తుగా కన్నుమూశారు.

బ్రిటిష్ ఇండియా వాయుసేన విభాగంలో పనిచేస్తున్న సందర్భంలో రెండవ ప్రపంచయుద్ధ కాలంలో కామ్రేడ్ యస్ఎన్ఎస్ కమ్యూనిస్టు పార్టీలో చేరారు. 1946లో ఉద్యోగంలో ఉండగానే ఆయన బ్రిటిష్ పతాకానికి సెల్యూట్ చేయటానికి నిరాకరించారు. ఈ కారణంగా రెండు సంవత్సరాలు జైలుశిక్ష ననుభవించారు. జైలు నుండి బయటకొచ్చిన తర్వాత ఆయన సిపిఐలో వృత్తి విప్లవకారునిగా పనిచేశారు. ఆయన మొదట షహాబాద్‌జిల్లాకు, ఆ తర్వాత దక్షిణ బీహార్ జిల్లాల పార్టీ ఇన్‌ఛార్జిగా బాధ్యతలు నిర్వహించారు.

టాటాలకు వ్యతిరేకంగా 1952లో జంషెడ్‌పూర్‌లో కా॥ యస్ఎన్ఎస్ చారిత్రక పోరాటం నిర్వహించారు. ఈ కారణంగా ఆయనతోపాటు మరో ముగ్గురిపై జెంషెడ్‌పూర్ కుట్రకేసు బనాయించి, 8 సం॥లు జైలులో నిర్బంధించారు. చైనాతో యుద్ధాన్ని వ్యతిరేకించినందుకుగాను 1962లో మరల ఆయనను అరెస్టు చేసి 4 సం॥లు నిర్బంధించారు. సిపిఐలో డాంగే రివిజనిస్టులతో చీలికలో ఆయన సిపిఐ(ఎం)తో నిలిచారు. చారిత్రాత్మక నగ్జల్బరీ పోరాట సందర్భంగా ఆయన దృఢంగా ఈ పోరాటంవైపు నిలిచి, సిపిఐ(ఎం)తో తెగదెంపులు చేసుకున్నారు.

బీహార్‌లో ముజఫర్‌పూర్‌లో చారిత్రక ముషాహరి తిరుగుబాటుకు నాయకత్వం వహించారు. సిపిఐ(ఎం–ఎల్)కు ముందు ఏఐసిసిఆర్ బీహార్ విభాగానికి ఆయన కన్వీనర్‌గా ఉన్నారు. ఉమ్మడి సిపిఐ(ఎం–ఎల్) సభ్యునిగానూ, కేంద్ర కమిటీ, పొలిట్‌బ్యూరో సభ్యునిగానూ ఆయన పనిచేశారు. తదనంతరం పునర్నిర్మించిన సిపిఐ(ఎం–ఎల్)కు ప్రధాన కార్యదర్శిగా, అటు తర్వాత పిసిసి సిపిఐ(ఎం–ఎల్) సంస్థాపకునిగా కృషిచేశారు.

కార్మికవర్గానికి, ఇతర ప్రజానీకానికి సంబంధించిన అనేక సమస్యలపై ఆయన గొప్ప పోరాటాలు సాగించారు. సింద్రి ఫెర్టిలైజర్స్, బొకారో సిఐఎస్ఎఫ్ జవాన్స్, సింగ్ భూమ్‌లోని రఖా రాగి గనులు, జాదుగూడలోని యురేనియం గనుల కార్మికులలో ఆయన చేసిన పోరాటాలను ఈనాటికీ గుర్తుచేసుకుంటారు. చిన్న పరిశ్రమలలోనే కాకుండా పెద్ద పరిశ్రమలలోని కార్మికవర్గాన్ని ఆర్గనైజ్ చేయగలిగిన శక్తి సామర్థ్యాలు కలిగినవారు.

ప్రజలు బాగా ప్రేమించిన ప్రజాదరణ కలిగిన నాయకుడాయన. ఎక్కడికి వెళ్ళినా ఆయన ప్రజలతో సంబంధాలు నెరిపేవారు. కమ్యూనిస్టు ఆదర్శాలతో కూడిన సాధారణ జీవనశైలితో, చురుగ్గా, దాపరికం లేకుండా వుండేవారు. 37వ వర్ధంతి సందర్భంగా ఈ గొప్ప విప్లవ కమ్యూనిస్టు నాయకునికి నివాళులర్పిద్దాం. ✸